సాక్షి
గుంటూరు
శనివారం ၊ 25 ၊ మార్చి ၊ 2023





## నిత్యాన్నదానానికి రూ.లక్ష విరాళం

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): దుర్గమ్మ సన్నిధిలో నిత్యాన్నదానానికి విజయవాడకు చెందిన సూరిపెద్ది వెంకట కనకదుర్గా వరప్రసాద్ శుక్రవారం రూ.1,01,116 విరాళాన్ని అందజేశారు.



## రంజాన్ మాసం ప్రారంభం

పాతగుంటూరు: పవిత్ర రంజాన్ మాసం ఉపవాన దీక్షలు (రోజా) శుక్రవారం ప్రారంభమయ్యాయి. గురువారం సాయంత్రం ఆకాశాన నెలవంక దర్శనం కావడంతో దువా చేసి దీక్షలు చేపట్టేందుకు సిద్ధమయ్యారు.

## రంజాన్ వేళలు

| | ఇఫ్తార్ (శని) | సహర్ (ఆది) |
|---|---|---|
| గుంటూరు | 6:25 | 4:52 |
| నరసరావుపేట | 6:27 | 4:49 |
| బాపట్ల | 6:25 | 4:52 |

## న్యూస్‌రీల్

### మంత్రి మేరుగ న్యాయసలహాదారుగా కృష్ణ



తెనాలి: ఆంధ్రప్రదేశ్ సాంఘిక సంక్షేమశాఖ మంత్రి డాక్టర్ మేరుగ నాగార్జున న్యాయ సలహాదారుగా తెనాలి న్యాయవాది గుంటూరు కృష్ణ నియమితులయ్యారు. శుక్రవారం సాయంత్రం మంత్రి చేతులమీదుగా ఆ జీవోను కృష్ణ స్వీకరించారు. ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ఆశీస్సులతో మంత్రి డాక్టర్ నాగార్జున సహకారంతో తన నియామకం జరిగిందని కృష్ణ తెలిపారు. సంవత్సర కాలం ఈ పదవిలో కొనసాగుతారు. గుంటూరు కృష్ణ స్వస్థలం వేమూరు నియోజకవర్గంలోని కొల్లూరు మండలం గ్రామం గుంటూరుగూడెం. 20 ఏళ్లుగా తెనాలిలో న్యాయవాదిగా ఉన్నారు. అంతకుముందు తెనాలి కేంద్రంగా పత్రికా విలేకరిగా చేశారు. జర్నలిస్టు అనుభవంతో 2004–09లో డాక్టర్ వై.ఎస్.రాజశేఖరరెడ్డి పరిపాలనపై 'లక్ష్యం–సాక్ష్యం' పుస్తకాన్ని రచించి, వారితోనే ఆవిష్కరింపజేశారు. 2010లో 'నాయకుడు–వైఎస్ జగన్ పేరుతో డైరీని తీసుకొచ్చారు. మోదుకూరి జాన్సన్‌పై 'చెరగని జ్ఞాపకాలు' రచించారు.

### ఐదుగురు విద్యార్థులపై మాల్ ప్రాక్టీసు కేసులు

**107 ఇంటర్ పరీక్షా కేంద్రాల్లో విస్తృత తనిఖీలు**

గుంటూరు ఎడ్యుకేషన్: సీనియర్ ఇంటర్ పరీక్షల్లో మాల్ ప్రాక్టీసుకు పాల్పడిన ఐదుగురు విద్యార్థులపై కేసులు నమోదయ్యాయి. శుక్రవారం ద్వితీయ సంవత్సర విద్యార్థులకు మ్యాథ్స్ పేపర్–2బీ, జువాలజీ, హిస్టరీ పేపర్–2 పరీక్షలు జరిగాయి. గుంటూరు గోరంట్లలోని శ్రీచైతన్య జూనియర్ పరీక్షా కేంద్రంలో ముగ్గురు విద్యార్థులతో పాటు చిలకలూరిపేటలోని ఏఎంజీ జూనియర్ కళాశాల పరీక్షా కేంద్రంలో కాపీయింగ్‌కు పాల్పడిన ఒక విద్యార్థిని గుర్తించిన అధికారులు మాల్ ప్రాక్టీసు కేసులు నమోదు చేశారు. గుంటూరు నవభారత్‌నగర్‌లోని శ్రీచైతన్య జూనియర్ కళాశాల పరీక్షా కేంద్రాన్ని డీఈఓ జె.పద్మ ఆకస్మికంగా తనిఖీ చేసిన సమయంలో ఒక విద్యార్థి స్లిప్పులను కలిగిఉండటాన్ని గుర్తించారు. దీంతో సదరు విద్యార్థిపై మాల్ ప్రాక్టీసు కేసు నమోదుతో పాటు విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరించిన ఇన్విజిలేటర్‌కు షోకాజ్ నోటీసు ఇచ్చారు. శుక్రవారం జరిగిన పరీక్షలకు ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 134 కేంద్రాల పరిధిలో కేటాయించిన 40,764 మంది విద్యార్థుల్లో 39,839 మంది హాజరయ్యారు. అత్యధికంగా 107 పరీక్షా కేంద్రాల్లో వివిధ శాఖల అధికారులతో పాటు పరిశీలకులు, స్క్వాడ్స్ విస్తృత తనిఖీలు నిర్వహించారు.

### యార్డులో 87,530 బస్తాల మిర్చి విక్రయం

కొరిటిపాడు(గుంటూరు): గుంటూరు మార్కెట్ యార్డుకు శుక్రవారం 81,449 మిర్చి బస్తాలు రాగా, గత నిల్వలతో కలిపి ఈ–నామ్ విధానం ద్వారా 87,530 బస్తాలు అమ్మకాలు జరిగాయి. నాన్ ఏసీ కామన్ రకం 334, నంబర్–5, 273, 341, 4884, సూపర్–10 రకాల మిర్చి సగటు ధర రూ.9,000 నుంచి రూ.25,000 వరకు పలికింది. నాన్ ఏసీ ప్రత్యేక రకం తేజ, బాడిగ, దేవనూరు డీలక్స్ రకాల మిర్చి సగటు ధర రూ.9,500 నుంచి రూ.27,000 వరకు లభించింది. తాలు రకం మిర్చికి రూ.5,200 నుంచి రూ.13,000 వరకు ధర దక్కింది. అమ్మకాలు ముగిసే సమయానికి యార్డులో ఇంకా 79,416 బస్తాలు మిర్చి నిల్వ ఉన్నట్లు యార్డు ఉన్నత శ్రేణి కార్యదర్శి ఐ.వెంకటేశ్వరరెడ్డి తెలిపారు.

### విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించాలి

**స్కూల్ ఎడ్యుకేషన్ ప్రిన్సిపల్ సెక్రటరీ ప్రవీణ్ ప్రకాష్**



సత్తెనపల్లి: విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించాలని స్కూల్ ఎడ్యుకేషన్ ప్రిన్సిపల్ సెక్రటరీ ప్రవీణ్ ప్రకాష్ అన్నారు. సత్తెనపల్లిలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం, రఘురాంనగర్‌లోని బీసీ బాలికల వసతి గృహాన్ని శుక్రవారం రాత్రి ఆయన సందర్శించారు. సిలబస్ ఎక్కడ వరకు పూర్తయింది, నోట్ పుస్తకాలను పరిశీలించారు. అనంతరం ఉపాధ్యాయులకు పలు సూచనలు చేశారు. సత్తెనపల్లి ఆర్డీవో బీఎల్ఎన్ రాజకుమారి, తహసీల్దార్ కె.నగేష్, మండల విద్యాశాఖ అధికారి ఎ.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

# అక్కచెల్లెమ్మలకు ఆసరా

- నేడు మూడో విడత వైఎస్సార్ ఆసరా చెల్లింపు
- ఇప్పటికే రెండు దఫాలుగా 58,590 డ్వాక్రా సంఘాల మహిళలకు రూ.493.15 కోట్లు జమ
- నేడు మరో రూ.246.30 కోట్లు విడుదల చేయనున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి
- రేపటి నుంచి పది రోజుల పాటు ప్రతి మండలంలో ఆసరా సంబరాలు



వైఎస్సార్ ఆసరా సమావేశంలో పాల్గొన్న అక్కచెల్లెమ్మలు (ఫైల్)

నెహ్రూనగర్(గుంటూరు): తన సుదీర్ఘ పాదయాత్రలో భాగంగా డ్వాక్రా అక్కచెల్లెమ్మలకు రుణమాఫీ చేస్తానన్న వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి హామీ మేరకు వైఎస్సార్ ఆసరా పథకాన్ని ప్రవేశపెట్టారు. సార్వత్రిక ఎన్నికల (11–04–2019) నాటికి వారి సంఘాలకు బ్యాంకుల్లో ఉన్న రుణాన్ని నాలుగు విడతల్లో మాఫీ చేస్తానని మాట ఇచ్చారు. అందులో భాగంగా మూడో విడత చెల్లింపులు శనివారం ప్రారంభం కానున్నాయి. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఏలూరు జిల్లా దెందులూరులో నగదు జమను ప్రారంభించనున్నారు. గుంటూరు కలెక్టరేట్‌లో జరిగే కార్యక్రమంలో జిల్లా ప్రజాప్రతినిధులు, కలెక్టర్, జేసీ, ఇతర ఉన్నతాధికారులు, మహిళలు పాల్గొననున్నారు. ఇప్పటికే సెప్టెంబర్ 11, 2020న తొలి విడతలో భాగంగా 29,216 సంఘాలకు రూ.244.47 కోట్ల చెల్లింపులు పూర్తి చేశారు. రెండో విడతలో భాగంగా అక్టోబర్ 7, 2021న 29,374 సంఘాల్లోని మహిళలకు రూ.248.68 కోట్లు జమ చేసింది. ఇప్పటి వరకు మొత్తం రెండు విడతల్లో గుంటూరు జిల్లాలోని అక్కచెల్లెమ్మల ఖాతాల్లో రూ.493.15 కోట్లు జమైంది. నేడు మూడో విడతగా 29,322 సంఘాలకు రూ.246.30 కోట్లు జమ చేయనున్నారు. మొత్తం మూడో విడతల్లో రూ.739.45 కోట్లు జమ చేశారు. జిల్లాలోని అన్ని గ్రామ, వార్డు సచివాలయాల్లో వైఎస్సార్ ఆసరా పథకం లబ్ధిదారుల జాబితాలు ప్రదర్శించి, అవగాహన కార్యక్రమాలను నిర్వహించారు.

**మూడు విడతల్లో గుంటూరు జిల్లాలో డ్వాక్రా మహిళలకు వైఎస్సార్ ఆసరా పథకం ద్వారా కలిగిన లబ్ధి..**

| | ఆసరా చెల్లింపు లబ్ధి పొందిన గ్రూపుల సంఖ్య | లబ్ధి పొందిన నగదు (రూ.కోట్లలో) |
|---|---|---|
| మొదటి | 9,216 | 244.47 |
| రెండో | 29,374 | 248.68 |
| మూడో | 29,322 | 246.30 |
| మొత్తం | | 739.45 |

**మహిళలకు జీవనోపాధులు..**

వైఎస్సార్ ఆసరా ద్వారా జమవుతున్న నగదును ఉత్సాహం ఉన్న డ్వాక్రా మహిళలు జీవనోపాధులైన పాడి పరిశ్రమ, రిటైల్ అమ్మకాలు, ఇతర ఉత్పత్తుల ద్వారా నెలనెలా ఆదాయం పొందేలా ప్రభుత్వం సహకరించనుంది. ఇందుకోసం అమూల్, హిందుస్థాన్ యూనిలీవర్, ప్రోక్టర్ అండ్ గ్యాంబల్ వంటి బహుళ జాతి సంస్థలతో ఒప్పందం చేసుకుంది. మహిళలు వారికి అనువుగా ఉన్న జీవనోపాధిని ఎంచుకోవచ్చు. ఆయా కంపెనీలు మహిళలకు అవసరమైన శిక్షణ ఇచ్చి జీవనోపాధి ఏర్పాటుకు సహకరిస్తాయి. ఇప్పటికే గుంటూరు జిల్లాలో వెయ్యి మందికిపైగా జీవనోపాధులు కల్పించారు.

**ఏప్రిల్ 5 వరకు ఆసరా ఉత్సవాలు..**

మహిళల సంక్షేమం కోసం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న ఆసరా పథకం మూడో విడత చెల్లింపుల కార్యక్రమం నియోజకవర్గాల వారీగా ప్రతి మండలంలో, మున్సిపాలిటీల్లో ఈ నెల 26 నుంచి ఏప్రిల్ 5వ తేదీ వరకు నిర్వహించనున్నారు. ఇందులో ఎమ్మెల్యేలు, ఎంపీలు మొదలు స్థానిక ప్రజాప్రతినిధులు, గ్రామ, వార్డు సచివాలయాల్లో అధికారులు మహిళలతో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించనున్నారు. అక్కచెల్లెమ్మలకు జగనన్న పంపిన సందేశంతో కూడిన పత్రాలను అందజేయనున్నారు. పది రోజుల పాటు పండుగ వాతావరణంలో ఈ కార్యక్రమాలు జరగనున్నాయి.

**ఇప్పటి వరకు రూ.46 వేలు జమ**



సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన మాట ప్రకారం ఆసరా పథకం కింద నాకు రెండు విడతల్లో రూ.46 వేలు జమ అయింది. వచ్చిన డబ్బుతో చిన్న వ్యాపారం చేసుకుంటున్నాను. శనివారం జమ కానున్న నగదు వ్యాపారాభివృద్ధికి దోహదపడుతుంది. సీఎం అమలు చేస్తున్న సాయంతో మహిళలు ఆర్థికంగా ఎదిగేందుకు ఎంతగానో దోహదపడుతుంది.

ఎం.కామేశ్వరి, గుంటూరు

**మహిళల అభివృద్ధి కోసమే**



మహిళల ఆర్థికాభివృద్ధే ధ్యేయంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నవరత్నాలలో భాగమైన వైఎస్సార్ ఆసరా పథకం మూడో విడత చెల్లింపులు శనివారం చేయనున్నారు. మహిళల సంక్షేమం కోసం ఇప్పటికే ఎన్నో పథకాలను ప్రభుత్వం అమలు చేస్తోంది. మహిళలు సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకుని వృద్ధిలోకి రావాలి. ఆసరా సొమ్మును మహిళలు నచ్చిన విధంగా వినియోగించుకొనే వెసులుబాటు ఉంది. ఉత్సాహం ఉన్న మహిళలకు జీవనోపాధులు కల్పించేందుకు ప్రభుత్వం తోడ్పాటునందిస్తోంది.

ఎం.వేణుగోపాల్‌రెడ్డి, జిల్లా కలెక్టర్, గుంటూరు

### రాగిజావ, చిక్కీ పంపిణీ వేళల్లో మార్పులు

**ఉదయం 8:45 గంటలకు బదులుగా 10:35 నుంచి పంపిణీ**

గుంటూరు ఎడ్యుకేషన్: ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు జగనన్న గోరుముద్ద కార్యక్రమంలో భాగంగా అందజేస్తున్న రాగిజావ, చిక్కీ పంపిణీ వేళల్లో మార్పులు చేస్తూ మిడ్ డే మీల్స్ డైరెక్టర్ నిధిమీనా ఉత్తర్వులు విడుదల చేసినట్లు డీఈవో పి.శైలజ శుక్రవారం తెలిపారు. ఈ నెల 21న ప్రభుత్వం అమల్లోకి తెచ్చిన రాగిజావ పంపిణీ ప్రక్రియ వారంలో మూడు రోజుల పాటు ప్రతి మంగళ, గురు, శనివారాల్లో ఉదయం 8.45కల్లా అందజేయాలని ఇచ్చిన ఉత్తర్వులను సవరించినట్లు పేర్కొన్నారు. ఇక నుంచి ఫౌండేషన్ స్కూళ్లలో ఆయా రోజుల్లో ఉదయం 10:35కు, హైస్కూళ్లలో ఉదయం 10:45కు రాగిజావ పంపిణీ చేయాలని తెలిపారు. చిక్కీని మధ్యాహ్న భోజనం తరువాత విద్యార్థులకు అందజేయాలని డీఈవో శైలజ హెచ్ఎంలను ఆదేశించారు.

**ఉర్దూ పాఠశాలల పనివేళల్లో మార్పులను అమలు చేయాలి..**

రంజాన్ మాసం సందర్భంగా ఉర్దూ మీడియం పాఠశాలల పనివేళల్లో మార్పులు చేస్తూ ప్రభుత్వం విడుదల చేసిన ఉత్తర్వులను అమలుపరచాలని డీఈవో శైలజ పేర్కొన్నారు. ఆయా పాఠశాలలు ఏప్రిల్ 22 వరకు ఉదయం 8.00 గంటల నుంచి మధ్యాహ్నం 1.30 వరకు పని చేసేలా పర్యవేక్షించాలని డీవైఈవోలు, ఎంఈవోలతో పాటు ఉర్దూ డీఐని ఆదేశించారు.

### పీఏసీఎస్ సీఈఓ సస్పెన్షన్

నిజాంపట్నం: నిజాంపట్నం పీఏసీఎస్ సీఈవో మోపిదేవి నాగేశ్వరరావును 6 నెలల పాటు విధుల నుంచి సస్పెండ్ చేసినట్లు చైర్మన్ మరకా శ్రీనివాసరావు తెలిపారు. శుక్రవారం నిజాంపట్నంలోని కార్యాలయంలో ఆయన మాట్లాడారు. 2021–22 సంవత్సరానికి సంబంధించి ఇన్‌కంట్యాక్స్ రిటర్న్‌ను పంపకపోవడం, 2018–19 నుంచి ఐటీ రిటర్న్‌ను సంఘం పేరున ఉన్న పాన్‌కార్డుపై కాకుండా సంఘ అధ్యక్షుడి పాన్‌కార్డు ద్వారా పంపడం, సంఘ సభ్యులు కొంత మందివి పాస్‌బుక్‌లు పోగొట్టడం వంటి పలు అవకతవకలపై చర్యలు తీసుకోవడం జరిగిందన్నారు.

# 'ఉద్యాన' రైతన్నకు బాసట!




కొల్లిపరలో నిర్మాణం పూర్తయిన కలెక్షన్ సెంటర్

కొరిటిపాడు(గుంటూరు): వ్యవసాయ రంగం అభివృద్ధే లక్ష్యంగా వైఎస్సార్ సీపీ ప్రభుత్వం సంక్షేమ పథకాలు అమలు చేస్తూ రైతులకు అండగా నిలుస్తోంది. పెట్టుబడి సాయం అందజేస్తున్న ప్రభుత్వం రైతు భరోసా కేంద్రాల ద్వారా సబ్సిడీ విత్తనాలు, ఎరువులు, వ్యవసాయ పరికరాలు, ఉచిత పంటల బీమా తదితర పథకాలు అందజేస్తోంది. లాభసాటి సాగుపై ఆర్‌బీకేల సిబ్బంది రైతులకు సలహాలు, సూచనలు అందజేస్తూ చైతన్య పరుస్తున్నారు. ఈ నేపథ్యంలో ఉద్యాన సాగును ప్రోత్సహిస్తూ రైతన్నకు బాసటగా నిలుస్తోంది. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం పండ్లు, కూరగాయలు గ్రేడింగ్, ప్యాకింగ్ చేసుకునేందుకు ఉద్యాన శాఖ ఆధ్వర్యంలో కలెక్షన్ సెంటర్ (పంట సేకరణ కేంద్రాలు) ఏర్పాటు చేస్తోంది. గుంటూరు జిల్లాకు 12 కలెక్షన్ సెంటర్లు మంజూరు కాగా ఇప్పటి వరకు కొల్లిపర, నందివెలుగు, కొత్తమల్లాయపాలెం, నుదురుపాడులో నిర్మాణాలు పూర్తయ్యాయి. ప్రత్తిపాడులో నిర్మాణం పూర్తయ్యి ప్రారంభానికి సిద్ధంగా ఉంది. మిగిలిన ఏడు చోట్ల వివిధ దశల్లో నిర్మాణాలు జరుగుతున్నాయి. రైతు ఉత్పత్తిదారుల సంఘాలకు యూనిట్లు పొందే అర్హత కల్పించారు. అగ్రికల్చర్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఫండ్‌తో కలెక్షన్ సెంటర్ నిర్మాణానికి ఉద్యాన శాఖ నిధులు మంజూరు చేస్తుంది. ఒక్కో యూనిట్ వ్యయం రూ.15 లక్షలు కాగా రైతుల వాటా కేవలం రూ.3.75 లక్షలు మాత్రమే చెల్లించాల్సిఉంటుంది. మిగిలిన రూ.11.25 లక్షలు ప్రభుత్వం సబ్సిడీపై అందిస్తుంది. ఒక్కో రైతు ఉత్పత్తిదారుల సంఘంలో 100 నుంచి 500 మంది సభ్యులుగా ఉన్నారు.

**తీరనున్న ఇబ్బందులు..**

వైఎస్సార్ సీపీ ప్రభుత్వ ప్రోత్సాహంతో రైతులు ఉద్యాన పంటల వైపు మొగ్గు చూపుతున్నారు. ఏడాదికేడాది ఉద్యాన పంటల సాగు పెరుగుతోంది. మిరప, అరటి, పసుపు, పండ్లు, కూరగాయల పంటల సాగు పెరుగుతోంది. జిల్లాలో మిరప 20 వేల హెక్టార్లు, పసుపు 1,600 హెక్టార్లు, పండ్లు 3,600 హెక్టార్లు, పూలు 500 హెక్టార్లు సాగు చేస్తున్నట్లు అధికారుల అంచనా. కూరగాయల పంటలు 3,500 హెక్టార్లలో సాగు చేస్తున్నారు. పంటల దిగుబడి సమయంలో సరైన ధరలు లేక రైతులు నష్టపోతున్నారు. దిగుబడులు నిల్వ చేసుకునే అవకాశం లేకపోవడంతో నష్టాలు చవిచూడాల్సివచ్చేది. ఇలాంటి సమస్యల నుంచి గట్టెక్కించేందుకు ప్రభుత్వం అన్ని రకాల చర్యలు చేపడుతోంది. కలెక్షన్ సెంటర్లలో రైతులు పండించిన కూరగాయలు, పండ్లు తదితరాల వాటిని నిల్వ చేసుకొని ధర లభించిన సమయంలో మార్కెటింగ్ చేసుకునే వెసులుబాటు కల్పించనుంది. దిగుబడులు గ్రేడింగ్, ప్యాకింగ్ చేసుకొని మార్కెట్‌లో అధిక ధరలకు విక్రయించుకోవచ్చు. దీంతో గతంలో పడిన ఇబ్బందులు తొలగనున్నాయి. 2,000 చదరపు అడుగుల విస్తీర్ణంలో షెడ్ నిర్మించి రైతులకు అనువుగా సౌకర్యాలు కల్పిస్తున్నారు.

**ప్రభుత్వ సహకారం అభినందనీయం..**



రైతులందరికీ అందుబాటులో రవాణ సౌకర్యం ఉండేలా కలెక్షన్ సెంటర్ నిర్మించాం. గ్రూపు సభ్యుల సహకారంతో పాటు ప్రభుత్వం పెద్ద మొత్తంలో సబ్సిడీ కల్పించడంతో కలెక్షన్ సెంటర్ ఏర్పాటుకు ముందుకొచ్చాం. రైతులకు ప్రభుత్వం అందజేస్తున్న సహకారం అభినందనీయం.


– ఎస్.కుటుంబరెడ్డి, శ్రేష్ట రైతు ఉత్పత్తిదారుల సంఘం అధ్యక్షుడు, కొల్లిపర

**ఇక నష్టాలు ఉండవు..**

ఉద్యాన పంటల దిగుబడుల సమయంలో ధరలు అనుకూలించక చాలా ఇబ్బందులు పడ్డాం. తప్పని పరిస్థితుల్లో నష్టానికే అమ్ముకున్నాం. దిగుబడులు నిల్వ చేసుకునేందుకు కలెక్షన్ సెంటర్ ఎంతో ఉపయోగంగా ఉంటుంది. ఇక ముందు నష్టాలు దాదాపు ఉండవు. ప్రత్యేకించి కూరగాయలు సాగు చేసే సన్న, చిన్నకారు రైతులకు బాగుంటుంది.

–ఎం.వెంకటేశ్వరరెడ్డి, రైతు, ప్రత్తిపాడు

**కలెక్షన్ సెంటర్లు ఉపయోగకరం**



ఉద్యాన పంటల ఉత్పత్తుల నిల్వ, గ్రేడింగ్, మార్కెటింగ్ చేసుకునేందుకు ఏర్పాటు చేయనున్న కలెక్షన్ సెంటర్లు రైతులకు చాలా ఉపయోగకరం. ఇప్పటికే జిల్లాలో కొల్లిపర, నందివెలుగు, కొత్తమల్లాయపాలెం, నుదురుపాడులో సెంటర్లు నిర్మించి ప్రారంభించాం. త్వరలో ప్రత్తిపాడులో నిర్మిస్తున్న కలెక్షన్ సెంటరును ప్రారంభించేందుకు చర్యలు తీసుకుంటున్నాం. రైతు ఉత్పత్తిదారుల సంఘాలు ముందుకు వస్తే మరిన్ని మంజూరు చేసేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉంది. ఉద్యాన రైతులు సద్వినియోగం చేసుకోవాలి.

– ఎస్.సుజాత, జిల్లా ఉద్యాన అధికారి

# పరిశ్రమల ఏర్పాటుకు విస్తృత అవకాశాలు

**కలెక్టర్ వేణుగోపాల్‌రెడ్డి**



అధికారుల సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ ఎం.వేణుగోపాల్‌రెడ్డి

గుంటూరువెస్ట్: జిల్లాలో పరిశ్రమలను ఏర్పాటుచేసే ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు పూర్తి సహకారం అందిస్తామని జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాల్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం రాత్రి స్థానిక కలెక్టరేట్‌లోని వీడియో సమావేశ మందిరంలో నిర్వహించిన ఇండస్ట్రియల్ ఎక్స్‌పోర్ట్ ప్రమోషన్ కమిటీ సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ ఇప్పటి వరకు వచ్చిన దరఖాస్తులను అధికారులు ప్రభుత్వ పాలసీ ప్రకారం పరిశీలించి ఆమోదించాలన్నారు. చిన్న చిన్న సమస్యలు ఏర్పడితే తన దృష్టికి తీసుకు రావాలన్నారు. బ్యాంకర్లు కూడా పరిశ్రమల స్థాపనకు మరిన్ని రుణాలు మంజూరు చేయాలన్నారు. జిల్లాలో సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమలను ప్రోత్సహించే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం సబ్సిడీ రుణాలు, ఇన్‌సెంటివ్స్ ద్వారా ఆర్థిక సహకారం అందిస్తోందన్నారు. అర్హత ఉన్న ప్రతి ఒక్కరూ వీటిని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఔత్సాహిక పారిశ్రామికవేత్తల నుంచి పరిశ్రమల ఏర్పాటుకు 508 దరఖాస్తులు అందాయని, వీటిలో సమాచారం పూర్తిస్థాయిలో క్రోడీకరించని 368 దరఖాస్తులు అందాయన్నారు. వీటిలో పూర్తి సమాచారం పొందుపరిచి దరఖాస్తుదారులు రెండు వారాల్లో ఆన్‌లైన్‌లో అప్‌లోడు చేయాలన్నారు. సబ్సిడీలో పొందే క్రమంలో ఎవరైనా అక్రమాలకు పాల్పడితే వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేస్తారని హెచ్చరించారు. సమావేశంలో లీడ్‌బ్యాంక్ మేనేజర్ ఈదర రాంబాబు, జిల్లా పరిశ్రమల శాఖ డీఎం విజయరత్నం, ఏపీఐఐసీ జోనల్ మేనేజర్ గోపికృష్ణ, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

# మిత్రులను మింగేసిన మృత్యువు

**చెరువులో ఈతకు దిగిన ఇద్దరు స్నేహితులు దుర్మరణం**



ప్రసన్నకుమార్ (ఫైల్)



నాగుల్‌మీరా (ఫైల్)

ప్రత్తిపాడు: సరదాగా చెరువు గట్టున సేదతీరుతూ కాలక్షేపం చేద్దామనుకున్న ఆ ఇద్దరు స్నేహితులను మృత్యువు వెంటాడింది. ఈత కొట్టేందుకు చెరువులోకి దిగిన ఇద్దరు మిత్రులను మృత్యువు కబళించిన విషాద ఘటన ప్రత్తిపాడులో చోటుచేసుకుంది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. ప్రత్తిపాడుకు చెందిన చీలి ప్రసన్నకుమార్ (25), షేక్ నాగుల్ మీరా (22) స్నేహితులు. ఇద్దరూ శుక్రవారం ఉదయం స్థానిక రక్షిత మంచినీటి చెరువులో ఈతకు దిగారు. కొద్ది క్షణాలకే చెరువులో కూరుకుపోయి మునిగిపోయారు. అదే సమయంలో అటువైపుగా పొలానికి వెళుతున్న ఎం.పూర్ణచంద్రరావు వారిని గమనించి విషయాన్ని ప్రసన్నకుమార్ కుటుంబ సభ్యులకు తెలియజేశారు. సమాచారం అందుకున్న ప్రత్తిపాడు ఎస్ఐ డి.రవీంద్రకుమార్ ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. స్థానిక ఈతగాళ్లను చెరువులోకి దింపి గాలించారు. ఫలితం లేకపోవడంతో ఫైర్, ఎన్‌డీఆర్ఎఫ్ బృందాలకు సమాచారమిచ్చారు. సుమారు మూడు గంటల పాటు శ్రమించి గజ ఈతగాళ్ల సాయంతో ఫైర్ సిబ్బంది, పోలీసులు మృతదేహాలను బయటకు తీశారు. ఈ మేరకు మృతుల కుటుంబీకులు షేక్ మున్ని, సీహెచ్ శివకుమారి ఇచ్చిన ఫిర్యాదుల మేరకు ఎస్ఐ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

**గర్భిణికి పుట్టెడు శోకం..**

భర్త దుర్మరణం భార్యకు పుట్టెడు శోకాన్ని మిగిల్చింది. మృతుడు ప్రసన్నకుమార్ కారు డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. అతనికి కొన్నేళ్ల కిందట వివాహం అయ్యింది. కుమారుడు ఉన్నాడు. ప్రస్తుతం భార్య మూడవ నెల గర్భవతి. గురువారం ఉదయం డ్యూటీకి వెళ్లి వస్తానని ప్రసన్నకుమార్ ఇంటి నుంచి బయటకు వెళ్లాడు. శుక్రవారం ఉదయం ప్రసన్నకుమార్ ఇంటికి వస్తాడని ఎదురుచూస్తుండగా, అతని మరణ వార్త రావడంతో భార్య గుండెలవిసేలా రోదిస్తోంది.

**అమ్మను ఒంటరిని చేసి..**

షేక్ అబ్దుల్ గఫార్, మున్నికి ముగ్గురు కుమార్తెలు, ఒక కుమారుడు. నాగుల్‌మీరా ఒక్కడే కుమారుడు. తండ్రి అబ్దుల్ గఫార్ పదిహేడేళ్ల కిందట మరణించడంతో తల్లీ కొడుకులిద్దరే ఉంటున్నారు. ప్రస్తుతం నాగుల్‌మీరా బేల్దారు పనులు చేసుకుంటూ కుటుంబాన్ని నెట్టుకొస్తున్నాడు. చేతికొచ్చిన కొడుకు అర్ధంతరంగా మరణించడంతో ఆ తల్లి ఒంటరి అయ్యింది. ఆమెకు అంతేలేని ఆవేదనను మిగిల్చింది. బిడ్డా నన్ను వదిలి వెళ్లావా.. అంటూ ఆ తల్లి రోదనలు చూపరులకు కంటతడిపెట్టించాయి.

# అవగాహనతో క్షయ నివారణ సులభం

**డీఎంహెచ్ఓ డాక్టర్ శ్రావణ్‌బాబు**





ర్యాలీలో డీఎంహెచ్ఓ డాక్టర్ శ్రావణ్‌బాబు, డాక్టర్ సుబ్బారావు, డాక్టర్ లక్ష్మానాయక్

గుంటూరు మెడికల్: క్షయ వ్యాధిపై అవగాహన కలిగిఉండటం ద్వారా చాలా సులభంగా వ్యాధిని నివారించవచ్చని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ అమర్తలూరి శ్రావణ్‌బాబు అన్నారు. ప్రపంచ క్షయ దినోత్సవం సందర్భంగా జిల్లా టీబీ నివారణ కేంద్రం ఆధ్వర్యంలో నగర ప్రజలకు టీబీపై అవగాహన కోసం భారీ ర్యాలీ నిర్వహించారు. గుంటూరు డీఎంహెచ్ఓ కార్యాలయం వద్ద ర్యాలీని డీఎంహెచ్ఓ డాక్టర్ అమర్తలూరి శ్రావణ్‌బాబు జెండాను ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా డీఎంహెచ్ఓ డాక్టర్ శ్రావణ్‌బాబు మాట్లాడుతూ క్షయ వ్యాధి నిర్ధారణ పరీక్షలు అన్ని ప్రభుత్వ వైద్యశాలల్లో ఉచితంగా చేస్తున్నామన్నారు. వైద్య పరీక్షలతో పాటు వైద్య సేవలు, మందులు ఉచితంగా అందిస్తున్నామన్నారు. ప్రతి నెల టీబీ రోగులకు రూ.500 నగదుతో పాటు, పోషకాహార కిట్‌ను అందిస్తున్నట్లు వెల్లడించారు. జిల్లా క్షయ నివారణ అధికారి డాక్టర్ బండారు సుబ్బారావు మాట్లాడుతూ ప్రధాన మంత్రి టీబీ ముక్త్ భారత్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా ప్రతి రోగికి నెలకు సుమారు రూ.700 విలువచేసే పోషక ఆహార పదార్థాల కిట్‌లను అందిస్తున్నామని తెలిపారు. ర్యాలీలో జిల్లా న్యూక్లియస్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ భూక్య లక్ష్మానాయక్, నేషనల్ హెల్త్ మిషన్ డీపీఎంఓ డాక్టర్ చుక్కా రత్నమన్మోహన్, మలేరియా సబ్‌యూనిట్ ఆఫీసర్ ఆలపాటి శ్రీమన్నారాయణ, నగరపాలక సంస్థ బయాలజిస్ట్ మధుసూదన్‌రావు, జిల్లా ఎయిడ్స్ కంట్రోల్ ప్రోగ్రామ్ మేనేజర్ లంకపల్లి మధుసూదన్‌రావు, వైద్య ఆరోగ్యశాఖ సిబ్బందితో పాటు నగరంలోని నర్సింగ్ కళాశాలల యజమానులు, విద్యార్థులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

**ప్రశంసా పత్రాలు అందజేత..**

గుంటూరు జీజీహెచ్‌లో వరల్డ్ టీబీ డే సందర్భంగా జరిగిన సదస్సులో జిల్లాలో క్షయ నివారణ కోసం విశేషంగా కృషి చేస్తున్న వైద్యులు, వైద్య సిబ్బందికి అవార్డులు, ప్రశంసా పత్రాలు అందజేశారు. వివిధ పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు సైతం బహుమతులు అందించారు. ముఖ్యఅతిథిగా విచ్చేసిన జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ నీలం ప్రభావతి మాట్లాడుతూ మహిళలు, చిన్నపిల్లలు, వృద్ధులకు వ్యాధి నిరోధక శక్తి తక్కువగా ఉంటుందన్నారు. వారు జాగ్రత్తగా తమ ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని చెప్పారు. క్షయకు సంబంధించిన లక్షణాలు గుర్తించిన వెంటనే తగు వైద్య సలహాలు తీసుకొని శారీరకంగా, మానసికంగా ఆరోగ్యంగా ఉండేటట్లు తగుప్రణాళిక రూపొందించుకోవాలన్నారు. సీనియర్ పల్మనాలజిస్ట్ డాక్టర్ జి.బాబురావు మాట్లాడుతూ గతంలో పోలిస్తే ఇప్పుడు క్షయ వ్యాధిగ్రస్తులకు చాలా మంచి మందులు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. ఆరు నెలల పాటు క్రమం తప్పకుండా మందులు వాడితే క్షయను నివారించడం చాలా సులభమని పేర్కొన్నారు. కార్యక్రమంలో డీఎంహెచ్ఓ డాక్టర్ శ్రావణ్‌బాబు, డాక్టర్ సుబ్బారావు, డాక్టర్ లక్ష్మానాయక్, డాక్టర్ అందే వెంకటేశ్వరరావు, ఇండియన్ మెడికల్ అసోసియేషన్ జిల్లా శాఖ ప్రెసిడెంట్ డాక్టర్ ఆవుల శ్రీనివాసరావు, ఐఎంఏ గుంటూరు జిల్లా ప్రధాన కార్యదర్శి డాక్టర్ వి.మహేష్ తదితరులు పాల్గొన్నారు.

# వినికిడి సమస్య లేని బాల్యాన్ని అందించాలి

**డీఎంహెచ్‌ఓ డాక్టర్ అమర్తలూరి శ్రావణ్‌బాబు**

**గుంటూరు మెడికల్:** వినికిడి సమస్యల వల్ల చిన్నారులు సామాజిక రుగ్మతలను ఎదుర్కొంటారని, చదువుతోపాటు అన్ని విషయాల్లోనూ వెనుకబడతారని డీఎంహెచ్‌ఓ డాక్టర్ అమర్తలూరి శ్రావణ్‌బాబు అన్నారు. ప్రతి ఒక్కరు పుట్టుక తోనే పిల్లల్లో వినికిడి సమస్యలను గుర్తించి చికిత్స అందించడం ద్వారా వినికిడి సమస్యలు లేని బాల్యాన్ని అందించవచ్చన్నారు. శుక్రవారం గుంటూరులోని ఏపీఎన్జీవో హాలులో జిల్లా సత్వర చికిత్స కేంద్రం, అలియవర్ జంగ్ నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ స్పీచ్ అండ్ హియరింగ్ డిజేబులీస్ అధ్వర్యంలో చిన్నారులకు ఉచితంగా వినికిడి యంత్రాలను అందజేశారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన డీఎంహెచ్‌ఓ డాక్టర్ శ్రావణ్‌బాబు మాట్లాడుతూ పిల్లలకు ఉచితంగా వినికిడి యంత్రాలు అందజేయడం బృహత్తరమైన కార్యక్రమని పేర్కొన్నారు. సుమారు రూ. 30 లక్షలు ఖరీదు చేసే వినికిడి యంత్రాలను 80 మంది చిన్నారులకు ఉచితంగా అందజేయడం అభినందనీయమని, ఉచిత వైద్య శిబిర నిర్వాహకులకు అభినందనలు తెలిపారు. ఏ ఒక్క పిల్లవాడు కూడా వినికిడి సమస్యతో బాధపడకూడదని, చిన్నారులకు గుంటూరు జీజీహెచ్ డైక్ సెంటర్ సిబ్బంది ముందస్తుగా స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించి వినికిడి యంత్రాలు ఉచితంగా అందజేయడం అభినందనీయమన్నారు. తల్లిదండ్రులు సదరు వినికిడి యంత్రాలను చాలా జాగ్రత్తగా ఉపయోగించుకుని పిల్లలు వినికిడి సమస్య లేకుండా ఆడుతూ పాడుతుండేలా చూడాలన్నారు. సకాలంలో వినికిడి సమస్యను గుర్తిస్తే ప్రభుత్వం ఉచితంగా సుమారు రూ. 16 లక్షల ఖరీదు చేసే కాక్లియర్ ఆపరేషన్లు సైతం చేయిస్తున్నట్లు వెల్లడించారు. ఎడిప్ స్కీమ్ ద్వారా ఉచితంగా వినికిడి యంత్రాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎడిప్ స్కీంకు చెందిన డాక్టర్ గౌరీశంకర్ పాటిల్, వారి బృందం, గుంటూరు డైక్ సెంటర్‌కు చెందిన ఆడియాలజిస్ట్ నవ్య, పిల్లల వైద్య నిపుణురాలు డాక్టర్ ప్రియాంక, మెడికల్ ఆఫీసర్ డాక్టర్ కీర్తి, మేనేజర్ శిరీష, ఆప్తోమెట్రీషియన్ ప్రతాప్, తదితరులు పాల్గొన్నారు.



వినికిడి యంత్రాలను బాలుడికి అందిస్తున్న డాక్టర్ శ్రావణ్‌బాబు

### రెండేళ్లుగా వినికిడి సమస్య

మాది మాచవరం మండలం కొత్తపాలెం గ్రామం. మా అబ్బాయి గద్దె భార్గవ్‌కు ఎనిమిది సంవత్సరాలు. రెండేళ్లుగా వినికిడి సమస్యతో బాధపడుతున్నాడు. జీజీహెచ్ డైక్ సెంటర్‌కు తీసుకు రాగా, ఉచితంగా అన్ని పరీక్షలు చేసి నేడు సుమారు రూ.50 వేలు ఖరీదు చేసే వినికిడి యంత్రాలు అందజేయడం చాలా సంతోషంగా ఉంది.



–గద్దె భార్గవ్‌తో తండ్రి వెంకటేశ్వరరావు

# రానున్న రోజుల్లో పార్టీని మరింత బలోపేతం చేయాలి

**ఎమ్మెల్సీ డొక్కా మాణిక్య వరప్రసాద్**

**పట్నంబజారు:** రానున్న రోజుల్లో పార్టీని మరింత బలోపేతం చేసేదిశగా అనుబంధ విభాగాలు పాటుపడాలని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు, ప్రభుత్వ విప్, ఎమ్మెల్సీ డొక్కా మాణిక్య వరప్రసాద్ చెప్పారు. ఈమేరకు కృష్ణనగర్‌లోని ఆయన కార్యాలయంలో శుక్రవారం జిల్లా అనుబంధ విభాగాల అధ్యక్షులతో సమావేశమయ్యారు. ఎమ్మెల్సీ డొక్కా మాణిక్య వరప్రసాద్ మాట్లాడుతూ ఏరాజకీయ పార్టీ అయినా అనుబంధ విభాగాలు ఎంతో కీలకమని, ప్రభుత్వం చేపడుతున్న పథకాలు, సంక్షేమం, అభివృద్ధిని ప్రజల్లోకి తీసుకెళ్లాల్సిన ముఖ్య బాధ్యత వారిపై ఉందన్నారు. ఇటువంటి నేపథ్యంలో ఎన్నికలకు సంవత్సరం సమయం ఉన్న నేపథ్యంలో ముందస్తుగానే ప్రణాళికా బద్ధంగా పార్టీకి మరింత బలోపేతం చేసేందుకు ముందుకు సాగాలన్నారు. దానిలో భాగంగా ఏప్రిల్ 5వ తేదీ నుంచి 14వ తేదీ వరకు అనుబంధ విభాగాలకు సంబంధించిన సమావేశాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఏప్రిల్ 5న భారత దేశ పరిపాలన రంగంలో బాబు జగజ్జీవన్‌రావ్ పాత్ర, 6వ తేదీన జగనన్న పాలన- రైతు సంక్షేమం, 7న జగనన్న పాలనలో విద్యా విప్లవం, 8న లా నేస్తం - పరిపాలన న్యాయ సంస్కరణలు, 9న జగనన్న పాలనలో వైద్య సంస్కరణలు, 10న గ్రామ పరిపాలన సంస్కరణలు, 11న జగనన్న పాలన, బీసీ సంక్షేమం, 12న జగనన్న పాలనలో యువత సాధికారిత, 13న జగనన్న పాలనలో మహిళ సాధికారిత పేరుతో సమావేశాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. 14న భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ జయంతి కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ పది రోజుల పాటు జరిగే కార్యక్రమాలు బృందావన్‌గార్డెన్స్‌లోని వైఎస్సార్‌సీపీ రీజనల్ కార్యాలయంలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం వరకు సమావేశాలు జరుగుతాయని వివరించారు. సమావేశంలో జిల్లా అనుబంధ విభాగాల అధ్యక్షులు సీడీ భగవాన్, మాదా రాధా, కళ్లం హరికృష్ణారెడ్డి, డాక్టర్ వై.షేక్, ఆవుల సుందరరెడ్డి, అల్లాబక్షు, మునగాల మల్లేశ్వరరావు, మేడా వెంకటేశ్వరరావు, ఎస్.ప్రభాకర్, సి.హెచ్.సాంబశివరావు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ మాణిక్య వరప్రసాద్, చిత్రంలో అనుబంధ విభాగాల అధ్యక్షులు

# శాసనసభ తీర్మానంతో దళిత క్రైస్తవుల్లో జోష్

**దళిత సార్వత్రిక విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య గుజ్జర్లమూడి కృపాచారి**

**తెనాలి:** ఆంధ్రప్రదేశ్ శాసనసభలో శుక్రవారం చేసిన కీలక తీర్మానాల్లో దళిత క్రైస్తవులను ఎస్సీ జాబితాలో చేర్చాలంటూ కేంద్ర ప్రభుత్వానికి సిఫార్సు చేసినందుకు వైఎస్సార్ సీపీ ప్రభుత్వానికి, ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డికి దళిత సార్వత్రిక విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య గుజ్జర్లమూడి కృపాచారి ఒక ప్రకటనలో కృతజ్ఞతలు తెలియజేశారు. దళిత క్రైస్తవులు మతం మారినంత మాత్రాన, వారి జీవన స్థితిగతుల్లో మార్పు లేదని, వారిని ఎస్సీలతో సమానంగా పరిగణించి, తగు రాయితీలను కల్పించాల్సిందిగా కేంద్ర ప్రభుత్వానికి విజ్ఞప్తిచేశారు. దేశ వ్యాప్తంగా గల దళిత క్రైస్తవ వర్గాలకు రాష్ట్ర ప్రభుత్వ సిఫార్సుతో మేలు చేకూరుతుందని అభిప్రాయపడ్డారు. వారి జీవనక్రమంలో మార్పులు సంక్రమించి, దళిత కుటుంబాల్లో సమానత్వం కలుగుతుందనీ, శాంతి పరిఢవిల్లుతుందన్నారు. సమసమాజ నిర్మాణంలో ఎస్సీ క్రైస్తవులంతా సామాజిక భాగస్వామ్యం వహిస్తారని తెలిపారు. శాసనసభలో తీర్మానంతో ఒక నూతన వ్యవస్థకు తెరతీసినందుకు, దేశవ్యాప్తంగా ఉన్న దళిత క్రైస్తవులకు కొత్త వెలుగు చూపినందుకు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు.

# ఆలయాల అభివృద్ధికి దాతలు రావడం అభినందనీయం

**కాజ(మంగళగిరి):** ప్రాచీన ఆలయాల అభివృద్ధికి దాతలు ముందుకు రావడం అభినందనీయమని టీటీడీ ట్రస్టుబోర్డ్ ఛైర్మన్ వైవీ సుబ్బారెడ్డి కొనియాడారు. నగర పరిధిలోని కాజలో వేంచేసియున్న శ్రీ కోదండ రామాలయం, అగస్తేశ్వర స్వామి ఆలయాల విమాన శిఖర ప్రతిష్టా మహోత్సవానికి శుక్రవారం ముఖ్య అతిథిగా విచ్చేసిన వైవీ సుబ్బారెడ్డి స్వామి వార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రాచీన ఆలయాల పునఃనిర్మాణానికి దాతలు సింహాద్రి వెంకట రామారెడ్డి దంపతులు పూనుకోవడం ప్రశంసనీయమన్నారు. ప్రాచీన ఆలయాల అభివృద్ధిలో భాగంగా టీటీడీ ఆధ్వర్యంలో రాష్ట్రంలోని మరిన్ని ఆలయాలను అభివృద్ధి పరిచేందుకు చర్యలు తీసుకుంటున్నామని, అందులో భాగంగా కాజ ఆలయాలకు తమవంతు సహాయ సహకారాలను అందిస్తామన్నారు. అనంతరం స్వామి వారికి విశేష పూజలు నిర్వహించి విమాన శిఖర ప్రతిష్ట, జీవకళాన్యాసం. మహాకుంభాభిషేకం, పూర్ణాహుతి, శాంతి కళ్యాణం నిర్వహించారు. పూజల్లో ఆప్కో ఛైర్మన్ గంజి చిరంజీవి, సింహాద్రి వెంకట రంగారెడ్డి దంపతులు, ఆర్ల రామయ్య, కమ్మెల సుబ్బారావు, మార్కెట్‌యార్డు మాజీ వైస్ ఛైర్మన్ అన్నపురెడ్డి బ్రహ్మారెడ్డి తదితరులు పాల్గొన్నారు. భక్తులకు అన్న ప్రసాదం వితరణ చేశారు.



పూజల్లో పాల్గొన్న టీటీడీ ట్రస్టుబోర్డ్ ఛైర్మన్ వైవీ సుబ్బారెడ్డి, దాత సింహాద్రి వెంకట రామారెడ్డి

# పాలీహౌస్‌లో అరుదైన పంటల సాగుకు అవకాశం

**జిల్లా ఉద్యాన శాఖ అధికారిణి సుజాత**

**తాడేపల్లిరూరల్:** సహజ వెంటిలేటెడ్ పాలీహౌస్‌లో అన్ని అరుదైన పంటలను పండించవచ్చని గుంటూరు జిల్లా ఉద్యానవన వ్యవసాయ అధికారిణి సుజాత అన్నారు. శుక్రవారం ఎంటీఎంసీ పరిధిలోని వడ్డేశ్వరం కేఎల్ విశ్వ విద్యాలయంలో ఏర్పాటు చేసిన పాలీహౌస్‌ను ఆమె ప్రారంభించారు. ఆమె మాట్లాడుతూ సహజ వెంటిలేటెడ్ పాలీహౌస్‌లో అన్ని కాలాలలో సహజసిద్ధంగా అరుదైన పంటలను పండివచ్చని, అత్యంత ఖరీదైన పూలు, పండ్లు పండించడానికి ఇది ఎంతో ఉపయోగపడుతుందన్నారు. కేఎల్‌యూ ఇఫ్ వైస్ ఛైర్మన్ కోనేరు రాజా హరీన్ మాట్లాడుతూ విశ్వవిద్యాలయంలో 10600 చదరపు అడుగుల విస్తీర్ణంలో సహజ వెంటిలేటెడ్ పాలీహౌస్‌ను ఏర్పాటు చేశామని, విద్యార్థులకు ఆధునిక వ్యవసాయ పద్ధతుల గురించి తెలుసుకునేందుకు అవకాశముంటుందన్నారు. భారతదేశంలో ఎనభై శాతం ఉన్న వ్యవసాయానికి తమ విశ్వవిద్యాలయం తరుపున ఆధునిక టెక్నాలజీని అందించడానికి ఇప్పటికే అనేక పరిశోధనలు చేశామన్నారు. పంటలకు తెగుళ్ల సోకినా, నీరు ఎక్కువగా ఉన్నా లేదా తక్కువగా ఉన్నా కేఎల్‌యూ విద్యార్థులు పొలానికి అనుసంధానం చేసిన ఐఓటీ సెన్సార్ పరికరం ద్వారా రైతు మొబైల్‌కు సమాచారం వస్తుందన్నారు. విశ్వవిద్యాలయ వైస్ చాన్సలర్ డాక్టర్ జి. పార్ధసారధి వర్మ, ప్రొ.వి.సి.డాక్టర్ ఎన్. వెంకట్రామ్, రిజిస్ట్రార్ డాక్టర్ సుబ్బారావు, ఎంహెచ్‌ఎస్ డీన్ డాక్టర్ ఎం.కిషోర్‌బాబు, పి అండ్ డి డీన్ డాక్టర్ వి. రాజేష్, వ్యవసాయ హానర్స్ విభాగ అధిపతి డాక్టర్ సింథెల్, డాక్టర్ కె.సి.హెచ్. శ్రీకావ్య పాల్గొన్నారు.



సహజ వెంటిలేటెడ్ పాలీహౌస్‌ను ప్రారంభిస్తున్న జిల్లా ఉద్యాన వ్యవసాయ అధికారిణి సుజాత

# నూతన అంశాలు వెలుగులోకి రావాలి

**వీసీ ఆచార్య పి రాజశేఖర్**

**ఏఎన్‌యూ:** తెలుగు భాషా విభాగం ఆధ్వర్యంలో జరుగుతున్న పరిశోధనలు, సదస్సుల ద్వారా తెలుగు సాహిత్యం, కవులు, రచయితలకు సంబంధించిన నూతన అంశాలు వెలుగులోకి తేవాలని వీసీ ఆచార్య పి.రాజశేఖర్ అన్నారు. ఆచార్య నాగార్జున యూనివర్సిటీ తెలుగు, ప్రాచ్య భాషా విభాగం ఆధ్వర్యంలో 'అనిశెట్టి -పినిశెట్టి సాహిత్యం-సామాజిక దక్కోణం' అనే అంశంపై రెండు రోజులపాటు నిర్వహిస్తున్న జాతీయ సదస్సును శుక్రవారం వీసీ ప్రారంభించారు. వీసీ ప్రసంగిస్తూ తెలుగు సాహిత్యం ద్వారా సామాజికంగా ఏంతో మార్పుకు కృషి చేసిన అనిశెట్టి- పినిశెట్టి లకు సంబంధించిన అంశాలపై జాతీయ సదస్సు నిర్వహించడం వల్ల వారి భావజాలాన్ని సమాజానికి మరింత చేరువ చేసినట్లవుతుందన్నారు. వారి సాహిత్య విలువలపై ఈ సదస్సులో కూలంకుషంగా చర్చించాలన్నారు. ఏఎన్‌యూ రెక్టార్ ఆచార్య పి. వరప్రసాద్ మూర్తి ప్రసంగిస్తూ సామాజిక అంశాలు, విలువల కోసం నిరంతరం కృషి చేసిన మహనీయులపై జాతీయస్థాయిలో చర్చ జరగడం అభినందనీయమన్నారు. యూనివర్సిటీ ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య సీహెచ్ స్వరూప రాణి మాట్లాడుతూ సమాజానికి వీరి నాటకాలు, సినిమాలు, వాటిలోని పాత్రల సృష్టి ద్వారా ఉన్నత విలువల్ని అనిశెట్టి సుబ్బారావు, పినిశెట్టి శ్రీరామమూర్తి సమాజానికి అందించారన్నారు. పినిశెట్టిపై కీలక ప్రసంగం చేసిన మద్రాస్ యూనివర్సిటీ తెలుగు విభాగాధిపతి ఆచార్య విస్తాలి శంకరరావు మాట్లాడుతూ నాటి నాటక, సినీ రచనలు, వాటి పాత్ర చిత్రాల్లోనూ నైతికత ప్రధానంగా ఉండేదన్నారు. కానీ నేడు అది లోపిస్తోందన్నారు. పినిశెట్టి ఆనాడే సమాజానికి మంచి విలువలతో కూడిన సాహిత్యాన్ని అందించారని అన్నారు. అనిశెట్టి పై కీలక ప్రసంగం చేసిన డా పి.వి. సుబ్బారావు ఆయన నాటక, సినీ రచనల్లో ఎంతో వైవిధ్యం ఉందన్నారు. అనిశెట్టి కుమారుడు, విశ్రాంత ఆంగ్ల అధ్యాపకుడు శాంత కుమార్ ప్రసంగిస్తూ తన తండ్రిలో ఎంతో ఉన్నత విలువలు ఉన్నాయని అవి తాను స్వయంగా చూశానన్నారు. సదస్సు డైరెక్టర్ ఆచార్య కృష్ణారావు సదస్సుద్దేశాన్ని వివరించారు.

# మిర్చియార్డులో రూ.7 కోట్ల పనులకు ప్రతిపాదనలు

- వచ్చే ఏడాది రూ.100 కోట్ల మార్కెట్ ఫీజు లక్ష్యం
- మిర్చి యార్డు పాలకవర్గ సమావేశంలో ఛైర్మన్ సుధాకరరెడ్డి

**కొరిటెపాడు(గుంటూరు):** గుంటూరు మార్కెట్ యార్డులో రూ.7 కోట్ల నూతన పనులకు ప్రతిపాదనలు సిద్ధం చేసినట్లు యార్డు ఛైర్మన్ మద్దిరెడ్డి సుధాకరరెడ్డి చెప్పారు. మిర్చి యార్డు ఆవరణలోని సమావేశ మందిరంలో మిర్చి యార్డు పాలకవర్గ సమావేశం శుక్రవారం జరిగింది. అనంతరం సమావేశంలో చర్చించిన విషయాలను ఆయన మీడియాకు వివరించారు. మిర్చి యార్డును సుందరవనంగా తీర్చి దిద్దేందుకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. గుంటూరు మార్కెట్ యార్డును అన్ని రంగాలలో దేశంలోనే ప్రథమ స్థానంలో నిలిపేలా కృషి చేస్తామన్నారు. యార్డుకు వచ్చే మిర్చి రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా మంచి ధర లభించేలా చూస్తామని వెల్లడించారు. రైతులు, వ్యాపారులు, హమాలీలకు న్యాయం జరిగేలా చూస్తామని పేర్కొన్నారు. ఏడాది మార్కెట్ ఫీజు గత ఏడాదితో పోలిస్తే భారీగా పెరిగిందని, గత ఏడాది రూ.63 కోట్ల మార్కెట్ ఫీజు వసూలు చేయగా, ఈ ఏడాది ఇప్పటికే రూ.87 కోట్లు వసూలు చేయడం జరిగిందని, ఈ నెల చివరి నాటికి రూ.90 కోట్లు వసూలు చేయడం జరుగుతుందన్నారు. 2023- 24 ఆర్థిక సంవత్సరంలో రూ.100 కోట్లు మార్కెట్ ఫీజు లక్ష్యంగా పాలకవర్గం, అధికారుల సమన్వయంతో ముందుకు సాగుతున్నామని స్పష్టం చేశారు. అనంతరం ఛైర్మన్ మద్దిరెడ్డి సుధాకరరెడ్డిని ఎక్స్‌ఫిషియో సభ్యుని హోదాలో సమావేశానికి హాజరైన గుంటూరు నగర మేయర్ కావటి శివనాగ మనోహర్‌నాయుడు దుశ్శాలువతో సత్కరించారు. సమావేశంలో మేయర్ కావటి శివనాగ మనోహర్‌నాయుడు, యార్డు ఉన్నత శ్రేణి కార్యదర్శి ఐ.వెంకటేశ్వరరెడ్డి పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న యార్డు ఛైర్మన్ మద్దిరెడ్డి సుధాకరరెడ్డి, మేయర్ శివనాగ మనోహర్‌నాయుడు

# రైతుల సమక్షంలో సర్వే పనులు

- జేసీ రాజకుమారి
- ప్రత్తిపాడు సివిల్ సప్లయీస్ గోడౌన్, ఆయిల్ బంకుల్లో ఆకస్మిక తనిఖీలు



ప్రత్తిపాడులోని పౌరసరఫరాల గిడ్డంగిలో తనిఖీలు చేస్తున్న జేసీ రాజకుమారి

**ప్రత్తిపాడు:** రైతుల సమక్షంలో సర్వే పనులు చేపట్టాలని జిల్లా జాయింట్ కలెక్టర్ జి.రాజకుమారి అన్నారు. ప్రత్తిపాడు మండలం కొండేపాడులో జరుగుతున్న వైఎస్సార్ జగనన్న శాశ్వత భూహక్కు, భూ రక్ష పథకం రీ సర్వేను శుక్రవారం జేసి పరిశీలించారు. రీ సర్వేలో భాగంగా చేస్తున్న గ్రౌండ్ ట్రూథింగ్, గ్రౌండ్ వ్యాలిడేషన్ పనుల వివరాలను సర్వే బృందాన్ని అడిగి తెలుసుకున్నారు. సర్వే సమయంలో రైతులు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. రికార్డుల తయారీ సమయంలో వీఆర్వోలు ముందుగానే సమాచారం సేకరించి రికార్డులలో మార్పులకు అడుగులు ముందుకు వేయాలన్నారు. గ్రామాల్లో జరుగుతున్న రీ సర్వే ప్రక్రియకు రైతులు సహకరించాలని కోరారు. మండల ఇన్‌చార్జి తహసీల్దార్ సుభాని తదితరులు పాల్గొన్నారు.


**ప్రత్తిపాడులో ఆకస్మిక తనిఖీలు**

నియోజకవర్గ కేంద్రం ప్రత్తిపాడులో జేసి రాజకుమారి ఆకస్మిక తనికీలు నిర్వహించారు. స్థానిక పౌరసరఫరాల గిడ్డంగితో పాటు సివిల్ సప్లయీస్ ఆధ్వర్యంలో నడుస్తున్న హెచ్‌పీ పెట్రోల్ బంకుల్లో తనిఖీలు చేపట్టారు. గోదాములోని సరుకుల నిల్వలు, స్టాక్ రిజిస్టర్లను పరిశీలించారు. గోడౌన్ నిర్వహణలో ఎదురవుతున్న సమస్యలను సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. పెట్రోల్ బంకులోని స్టాక్ నిల్వను తనికీ చేసి ప్రజలకు అసౌకర్యం తలెత్తకుండా తగుఏ భద్రతా ప్రమాణాలతో బంకును నిర్వహించాలని ఆదేశించారు.

# నమ్మక ద్రోహులకు బహిష్కరణ సబబే

**బాపట్ల ఎంపీ నందిగం సురేష్**

**తాడికొండ:** నమ్మక ద్రోహులను పార్టీ నుంచి బహిష్కరించడం సబబేనని బాపట్ల ఎంపీ నందిగం సురేష్ అన్నారు. తుళ్లూరు మండలం ఉద్దండ రాయుని పాలెం గ్రామంలో శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ కన్నతల్లి లాంటి పార్టీని ఎవరు మోసం చేసినా రియాక్షన్ ఇలానే ఉంటుందన్నారు. సీఎం వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి కష్టార్జితంతో గెలిచిన పార్టీయే తప్ప మేమెవరం సాధించింది కాదన్నారు. రాష్ట్ర ప్రజలందరూ జగన్‌మోహన్‌రెడ్డిని నమ్మి 151 సీట్లు ఇచ్చారని, అందులో మేమందరం ఉన్నామని, గెలిచిన వారు నమ్మకంగా ఉండాలే తప్ప ప్రతిపక్ష పార్టీలు ఇచ్చే అరకొర డబ్బులకు ఆశపడి కక్కుర్తి పనులు చేసుకుంటూ కన్నతల్లి లాంటి పార్టీని మోసం చేయడం కరెక్టు కాదన్నారు. పార్టీలో ఉంటూ పార్టీని మోసం చేసిన, వ్యక్తిగతంగా విమర్శించిన ప్రతి ఒక్కరికీ ఇలాంటి చర్యలే ఉంటాయి తప్ప ఇందులో ఎలాంటి రాజీ ఉండదన్నారు.



నందిగం సురేష్, ఎంపీ బాపట్ల